ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు 5
బుధవారం 17 జూలై 2024







- భూ హక్కు పత్రాల ఉపసంహరణకు రంగం సిద్ధం
- కొత్త పాసుపుస్తకాల జారీకి ఏర్పాట్లు
- వైసీపీ ప్రభుత్వంలో సర్వేయర్ల ఇష్టారాజ్యం
- తీవ్రంగా నష్టపోయిన రైతాంగం
- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసిన కూటమి ప్రభుత్వం
- కేబినేట్ భేటీలో కీలక తీర్మానం

మీ భూమి మీదే

నంద్యాల మండలంలోని ఓ గ్రామానికి చెందిన వృద్ధురాలి పేరున 0.43 ఎకరం పొలం ఉంది. తన భర్త మరణానంతరం ఈ భూమిని సాగు చేసుకుంటూ ఆమె జీవిస్తోంది. భూ రీసర్వేలో 4 సెంట్ల భూమి తక్కువగా ఉందంటూ, 0.39 ఎకరం విస్తీర్ణం మాత్రమే భూమి ఉందని జగనన్న భూ హక్కు పత్రంలో నమోదు చేసి పట్టా ఇచ్చారు. ఇక్కడ ఎకరా భూమి విలువ దాదాపు రూ.1.50 కోట్ల నుంచి రూ.2 కోట్ల వరకు పలుకుతోంది. దీంతో దాదాపు రూ.10 లక్షల విలువ చేసే 4 సెంట్ల భూమిని ఆమె కోల్పోయింది. తనకు జరిగిన అన్యాయంపై ఆ వృద్ధురాలు వైసీపీ ప్రభుత్వంలో అధికారుల చుట్టూ, స్పందనకు వెళ్లి గోడు వెళ్లబోసుకున్నా న్యాయం జరగలేదు.

- నంద్యాల మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళకు కొంత పొలం ఉంది. అత్యంత ఖరీదైన ఈ పొలం పక్కనే ఓ వైసీపీ నాయకుడు ఇళ్ళ స్థలాల వెంచర్ వేశాడు. వెంచర్ ఏర్పాటులో భాగంగా మహిళకు చెందిన పొలాన్ని కొనుగోలు చేశాడు. అడ్వాన్స్ ఇచ్చి అగ్రిమెంట్ చేసుకున్నప్పటికీ పూర్తి మొత్తం చెల్లించలేదు. ఒప్పందం మేరకు డబ్బులు ఇవ్వాలని ఆ కుటుంబం సదరు వైసీపీ నాయకుడి చుట్టూ తిరుగుతూనే ఉంది. అయితే రీ సర్వేలో ఈ మహిళకు చెందిన భూమిని కేవలం అడ్వాన్స్ అగ్రిమెంట్‌ను ప్రాతిపదికగా తీసుకుని సర్వే చేసిన అధికారులు జగనన్న భూ హక్కు పత్రంలో లేకుండా చేశారు. పైగా వైసీపీ నాయకుడికి సంబంధించిన వెంచర్ (బినామీ పేరు) పేరుపై మార్చేశారు. పొలం అమ్మిన మాట వాస్తవమే కానీ తనకు డబ్బులు ఇవ్వలేదని, వారిపేరుపై తాను రిజిస్ట్రేషన్ కూడా చేయలేదని, అగ్రిమెంట్‌పైనే తన పాసుబుక్కులోని సర్వే నంబరు పొలాన్ని వేరొకరి పేరుపై ఏలా మార్చుతారని ఆ మహిళ లబోదిబోమంటోంది.

నందికొట్కూరు నియోజకవర్గానికి చెందిన వైసీపీకి వీరాభిమానిగా ఉండే ఓ వ్యక్తి నంద్యాలలో నివాసం ఉంటున్నాడు. ఉన్న పొలంలో రీ సర్వేలో కొంత భాగాన్ని అతని దాయాదుల పేరుపైకి మారిపోయింది. అప్పట్లో అధికార పార్టీకే చెందిన వ్యక్తి అయినప్పటికీ జగనన్న భూ రీ సర్వేలో తనకు జరిగిన అన్యాయంపై వైసీపీ ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాక వారు కూడా చేతులెత్తేశారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమికి జగనన్న భూ రీసర్వే ప్రధాన కారణమైంది. ఫలితంగా వైసీపీకి సానుభూతిపరులుగా ఉన్న చాలామంది ఆ పార్టీకి వ్యతిరేకంగా ఓటువేశారు.

నంద్యాల టౌన్, జూలై 16: వైసీపీ ప్రభుత్వ హయంలో భూ హక్కు ఉన్న రైతాంగానికి కంటి మీద కునుకు లేకుండా చేసిన వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం కింద జారీ అయిన భూ హక్కు పత్రాల ఉపసంహరణకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు మంగళవారం అమరావతిలో జరిగిన కేబినేట్ సమావేశంలో ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కాగా జగన్ ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా భూ రీసర్వే అంశం పలు విమర్శలకు దారి తీసినప్పటికీ వైసీపీ ప్రభుత్వం వెనక్కు తగ్గకుండా రీ సర్వే చేపట్టింది. 'మీ భూమి - మా హామీ' అంటూ జగన్ ప్రభుత్వం తన బ్లూ మీడియా పత్రికల మొదటి పేజీలకు రూ.కోట్ల వెచ్చించి ప్రకటనలు ఇచ్చి జనాన్ని మభ్యపెట్టారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు కూలదోయడం, టీడీపీ - జనసేన - బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో భూ హక్కు పత్రాల ఉపసంహరణకు పూనుకుంది. త్వరలోనే కొత్త పట్టాదారు పాస్తుకాల జారీకి రాజముద్రతో భూ యజమానులకు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుండటం సర్వత్రా ఆనందం వ్యక్తమవుతోంది.



వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన భారీ ప్రకటనలు

పెరిగిన సరిహద్దు తగాదాలు

వైసీపీ ప్రభుత్వం భూ వివాదాల శాశ్వత పరిష్కారానికి రీ సర్వే చేపట్టినట్లుగా ఆర్భాటంగా జగనన్న భూ హక్కు పథకాన్ని ప్రవేశపెట్టినట్లు చెప్పుకొచ్చింది. రీ సర్వే జరిగిన గ్రామాల్లో ఉన్న భూమి విస్తీర్ణంలో తక్కువ చూపడం, ఒకరి పొలాన్ని మరొకరి పేరుపై ఆన్‌లైన్‌లో నమోదు చేయడం తదితర తప్పిదాలు విపరీతంగా జరిగాయి. దీంతో రీ సర్వే చేసిన గ్రామాల్లో కొంత మంది రైతులకు 1బీ, అడంగల్ పత్రాలకు ఆన్‌లైన్‌లో కనిపించకుండా పోయాయి. భూ సరిహద్దు తగాదాలు రెట్టింపయ్యాయి. తమకు సంక్రమించిన ఆస్థికి సంబంధించి కొనుగోలు రిజిస్టర్ పట్టాలు, వంశపారంపర్యం కింద వచ్చిన భూ హక్కు పత్రాలు, వాటికి సంబంధించి దశాబ్దాల క్రిందటనే జారీ అయిన రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను చేతపట్టుకొని అధికారుల వద్దకు తిరుగుతూనే ఉన్నారు. తమకు అన్యాయం జరిగిందని, రీ సర్వేలో తప్పుల తడకలు, జగనన్న ఫొటోతో కూడిన హక్కు పత్రంలో తప్పుడు భూవిస్తీర్ణం నమోదుపై ఫిర్యాదులు చేస్తూనే, భూ హక్కు పత్రంపై యజమాని ఫొటో కంటే జగన్ ఫొటో పెద్దగా ఉండటంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైనప్పటికీ వైసీపీ ప్రభుత్వం మొండిగానే ముందుకెళ్లింది.



సీఎం జగన్ ఫొటోతో కూడిన భూ రక్ష పథకం పాసుబుక్

కొత్త పట్టాదారు పాసుపుస్తకాల జారీకి ప్రభుత్వం ఏర్పాట్లు

సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోర ఓటమికి జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం కింద జారీ అయిన పాసుపుస్తకాలు, తప్పుల తడకలు, పేద భూ యజమానులకు తీవ్ర ఆర్థిక నష్టం, తదితర అంశాలు ప్రధాన కారణమని స్పష్టమైంది. ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు వైసీపీ ప్రభుత్వంపై నిప్పులు చెరుగుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్ ఫొటో తొలగించి కొత్త పాసుపుస్తకాలు జారీ చేస్తామని ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న త్వరితగతిన నిర్ణయాల అమలులో భాగంగా జగన్ ఫొటోతో ఉన్న భూ హక్కు పత్రాల ఉపసంహరణకు నిర్ణయం తీసుకుంది. జగన్ ఫొటోను తొలగించి గతంలో మాదిరిగానే రాజముద్రతో కూడిన కొత్త పాసుపుస్తకాలు త్వరలోనే జారీ కానున్నాయి.

సర్వేయర్ల ఇష్టారాజ్యం

వైసీపీ ప్రభుత్వంలో భూ రీ సర్వేలో సర్వేయర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. గ్రామాల్లో పరిస్థితులకు అనుగుణంగా వైసీపీ నాయకులు చెప్పినట్లుగా సర్వేయర్లు భూ రీ సర్వే తతంగంలో కీలకంగా వ్యవహరించడంతో రైతులు, భూ యజమానులు నష్టపోయారు. సర్వే సిబ్బందితో తమకు జరిగిన అన్యాయాన్ని చెప్పుకుందామని వెళ్లిన యజమానులకు సిబ్బంది తలబిరుసు సమాధానాలతో అప్పట్లో వణికిపోయారు. తగ్గించి చూపిన భూమి విస్తీర్ణాన్ని మరోసారి కొలిచి తమకు న్యాయం చేయాలని కోరినప్పటికీ అటువైపు సర్వేయర్లు తొంగిచూడలేదు. మరికొందరు చేతిలో డబ్బు పెడితేగానీ రీ సర్వేలో చోటు చేసుకున్న తప్పుడు విస్తీర్ణాలపై మరోసారి సర్వే చేసేందుకు క్షేత్రస్థాయికి అడుగుపెట్టని పరిస్థితి కూడా యజమానులను ఆందోళనకు గురి చేసింది.

భూ యజమానుల గగ్గోలు

భూ రీ సర్వేలో లోపాల కారణంగా రైతులు, భూ యజమానులు తీవ్ర అవస్థలు గురి కావడంతో పాటు, నష్టాన్ని చవిచూశారు. క్షేత్రస్థాయిలో భూ యజమానులకు సమాచారం ఇవ్వకుండానే సర్వేయర్లు వెళ్లి సర్వే చేయడం, మరికొన్ని చోట్ల అసలు క్షేత్రస్థాయికి వెళ్లకుండానే ఆఫీసు గదుల్లో కూర్చొని హద్దులు నిర్ణయించి ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేశారన్న ఆరోపణలు తీవ్రస్థాయిలో ఉన్నాయి. రీ సర్వే తరువాత భూ విస్తీర్ణంలో తేడాలు, భూ హక్కు పత్రాల్లో తప్పులు దొర్లడం, సరి చేయాలని బాధిత వర్గాలు రాతపూర్వక ఫిర్యాదులు అధికార యంత్రాంగానికి అందజేసినప్పటికీ తప్పులను సరిదిద్దే ప్రయత్నాలను వైసీపీ ప్రభుత్వం అసలు పట్టించుకోలేదు. పలువురు రైతులు, భూ యజమానులు మండల, డివిజన్ స్థాయి అధికారుల వద్ద నెత్తినోరు బాదుకున్నా రైతులకు న్యాయం జరగలేదు.

రైతులను సర్వనాశనం చేసిన జగన్



జగన్ సైకో పాలనలో రైతులను, వ్యవసాయ రంగాన్ని వైసీపీ ప్రభుత్వం సర్వనాశనం చేసింది. దశాబ్దాల తరబడి వారసత్వంగా వస్తున్న హక్కులతో ఉండే భూ యజమానులు, వ్యవసాయ రంగంపై మక్కువతో భూములను కొనుగోలు చేసే భూ యజమానులకు రాజ్యాంగ వ్యవస్థ చట్టాలకు అనుగుణంగా రాజముద్రతో పట్టాదారుపాసుపుస్తకాలు ఇవ్వడం జరుగుతుంది. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ప్రజల భూ ఆస్థి హక్కు పట్టాదారుపుస్తకాలపై తన ఫొటో వేయించుకున్న ఏకైక వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి. సైకో పాలనకు ప్రజలంతా చరమగీతం పాడారు. ఎన్నికల సందర్భంగా చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేశారు. త్వరలోనే రాజముద్రతో కూడిన పట్టాదారుపుస్తకాలను కూటమి ప్రభుత్వం భూ యజమానులకు అందజేస్తుంది.

- గుంటుపల్లి హరిబాబు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నంద్యాల

ఉపాధి మార్గాలను అన్వేషించండి

కలెక్టర్ రాజకుమారి



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల (కల్చరల్), జూలై 16: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఉపాధిమార్గాలను అన్వేషించాలని కలెక్టర్ రాజకుమారి స్కిల్ డెవలప్‌మెంట్, ఉపాధి కల్పన అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ చాంబర్‌లో ఉపాధి కల్పన, స్వయం ఉపాధి మార్గాలపై జిల్లా ఉపాధి కల్పనాధికారి ప్రతాపరెడ్డి, జూనియర్ ఎంప్లాయిమెంట్ అధికారి సోమశివారెడ్డి తదితరులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు బానిసకాకుండా ఆసక్తిగల రంగాలలో నైపుణ్యం గల శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలను కల్పించేందుకు మార్గాలను అన్వేషించాలని ఆదేశించారు. స్వయం ఉపాధి రంగాలలో ఉన్న అవకాశాలను గుర్తించి నియోజకవర్గాల వారీగా యూనిట్ల స్థాపనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. స్థానికంగా ఉపాధిరంగాల యూనిట్ల స్థాపనకు అవసరమైన వనరులను గుర్తించి నూతన ప్రాజెక్టులతో ప్రతిపాదనలు తీసుకురావాలన్నారు. డోన్‌లో ఉన్న మోడల్ కెరీర్ సెంటర్‌ను నంద్యాలకు తరలించేందుకు సరైన కారణాలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలన్నారు.

మల్లన్న సన్నిధిలో ప్రముఖులు

శ్రీశైలం, జూలై 16: శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను మంగళ వారం ఆంధ్రప్రదేశ్ ఎపిఎస్‌పిఎఫ్ డీజీపీ త్రివిక్రమవర్మ దర్శించుకున్నారు. ఆలయ రాజగోపురం వద ఆయనకు ఆలయ కార్యని ర్వహణాధికారి డి. పెద్దిరాజు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అలాగే గోవా వైద్యశాఖ మంత్రి విశ్వజిత్ పి రనె, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వీరికి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు.



ఆలయ ప్రాంగణంలో ఏపీఎస్‌పిఎఫ్ డీజీపి త్రివిక్రమవర్మ

ఆలయ ప్రాంగణంలో మంత్రి విశ్వజిత్ పి రనె





ఆలయ ప్రాంగణంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు

భ్రామరికి పసిడి హారం

శ్రీశైలం, జూలై 16: శ్రీశైల భ్రమరాంబికాదేవి అమ్మవారికి మంగళవారం హైదరాబాద్‌కు చెందిన నాగోజి వెంకటేశ్వరకుమార్, శివకుమారి దంపతులు మామిడి పిందెలతో రూపకల్పన చేసిన పసిడి హారాన్ని సమర్పించారు. ముత్యాలు, ఎర్రరాళ్ళు, పచ్చరాళ్లు, తెల్లరాళ్లతో పొదిగిన ఈ బంగారు హారం 120 గ్రాముల బరువుతో రూ. 8,35,000 విలువ ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ హారాన్ని అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో దాతలు ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజుకు అందజేశారు. దాతలను ఈవో పెద్దిరాజు స్వామి, అమ్మవార్ల శేషవస్త్రాలతో సత్కరించి, ప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.



బంగారు హారాన్ని ఈవోకు అందజేస్తున్న దాతలు

నేడు తొలి ఏకాదశి

- ముస్తాబైన వైష్ణవ ఆలయాలు
- చాతుర్మాస దీక్షలకు ప్రాముఖ్యత

కర్నూలు (కల్చరల్), జూలై 16: తెలుగువారు పవిత్రంగా భావించే తిథుల్లో ఏకాదశి ఒకటి. ప్రతి నెలలో రెండుసార్లు ఏకాదశి వచ్చినప్పటికీ, ఆషాఢమాసంలో వచ్చే తొలి ఏకాదశికి ప్రాధాన్యతనిస్తారు. సర్వమానవాళి రక్షకుడు శ్రీమహావిష్ణువు అనుగ్రహంతో అకాల మృత్యుహరణంతో పాటు మోక్షప్రాప్తి కోసం ఈ రోజున కఠిన నియమాలతో ఉపవాస వ్రతాలు ఆచరిస్తుంటారు. సంప్రదాయవాదులు అందరూ ఈ తిథితో పండుగల ప్రస్థానం మొదలవుతున్నట్లుగా భావిస్తారు. మోక్ష సాధనకు మనసును మహా విష్ణువుపైన లగ్నం చేసి ఆరాధించడమే ఏకాదశి పండుగ ప్రత్యేకం. ఏకాదశి రోజున ఉపవాస దీక్షలు ఆచరించి తెల్లవారాక అంటే ద్వాదశి రోజున ఎవరికైనా భోజనం పెట్టి ఉపవాస దీక్ష విరమిస్తే లక్ష్యం సిద్ధిస్తుందని నమ్ముతారు. లోకాలన్నింటినీ పరిపాలించే శ్రీమహావిష్ణువు జగద్రక్ష విధుల్లో అలసిపోయాక విశ్రాంతి కోసం యోగనిద్రలోకి వెళ్లే రోజు తొలి ఏకాదశి. అందుకే దీనిని శయనైకాదశిగా వ్యవహరిస్తారు. తిరిగి నాలుగు నెలల తర్వాత కార్తీక మాసంలోని ఏకాదశి రోజున శ్రీమహావిష్ణువు మేల్కొంటారు. దీని ఉత్థాన ఏకాదశిగా, వైకుంఠ ఏకాదశిగా వ్యవహరిస్తారు. ఈ నాలుగు నెలల కాలంలో వివిధ హిందూధర్మాన్ని బోధించే మఠాలు, ఆశ్రమాల్లోని వారంతా చాతుర్మాస దీక్షలను ఆచరిస్తారు. ఈ నాలుగు నెలలు మహా విష్ణువు పాతాళలోకంలోని బలి చక్రవర్తి వద్ద ఉండి, కార్తీక పౌర్ణమి నాడు తిరిగి వస్తాడని విష్ణుపురాణం చెబుతుంది.

పుణ్యప్రదం.. ఏకాదశివ్రతం

చాతుర్మాస దీక్షల్లో ఆరోగ్య పరిరక్షణ దిశగా ఆహార నియమాలను నియంత్రిస్తుంది. ఈ నాలుగు నెలల కాలంలో కేవలం కూరగాయలు, దుంపలు, పేలాలు వంటివి ఇలా శారీరక యోగాన్ని పెంపొందించుకునే దిశగా నాలుగు నెలల పాటు దీక్షలను ఆచరిస్తారు. ఏకాదశి రోజున రాత్రి జాగరణ చేస్తారు. విష్ణు సహస్ర నామ పారాయణాలు, విష్ణుమూర్తికి సంబంధించిన భాగవత కథలు పఠిస్తారు. నగరంలోని వివిధ వైష్ణవ దేవాలయాల్లో ఏకాదశి సందర్భంగా వేకువ జామునుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



ఆరోగ్య పరిరక్షణకే చాతుర్మాస దీక్షలు



తొలి ఏకాదశి పండుగ హైందవ సంస్కృతి సంప్రదాయాలను తెలియజేస్తుంది. ఇందులో ఎన్నో ఆధ్యాత్మిక, ఆరోగ్య రహస్యాలు దాగి ఉన్నాయి. తొలి ఏకాదశి నుంచీ నాలుగు నెలల పాటు చాతుర్మాస దీక్షలు మొదలు అవుతాయి. ఇవి ఒకరకంగా మన ఆరోగ్యాన్ని, ఆయుష్షును పెంపొందింపజేసేవి. ఈ చాతుర్మాస దీక్షల్లో తీసుకునే ఆహార నియమాలు ప్రతి వ్యక్తిని ఒక యోగిగా తయారు చేస్తాయి. ఈ నాలుగు మాసాల్లో స్వీకరించే సాత్విక ఆహారం వల్ల శరీరంలో అనేక మార్పులతోపాటు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది. హిందుత్వ పండుగల్లో భక్తిభావనతోపాటు అంతర్లీనంగా ఆరోగ్యసంరక్షణకు అనేక సూత్రాలు దాగి ఉన్నాయి.

- దేవళ్ల వసంత సాయినాథ శర్మ, అర్చకులు, కర్నూలు

వీడిన మిస్టరీ.. దొరకని మృతదేహం..!



ముచ్చుమర్రి ఎత్తిపోతల పతకం అప్రోచ్ కాలువలో మృతదేహం కోసం గాలిస్తున్న ఎన్.డి.ఆర్.ఎఫ్ బృందాలు(ఫైల్)

- వాసంతి ఘటనలో పురోగతి
- అత్యాచారం, హత్య చేసిన మైనర్లు..
- బాలిక మృతదేహాన్ని నదిలో పారేసిన పెద్దలు
- పోలీసుల అదుపులో ముగ్గురు మైనర్లతో పాటు మరో ఇద్దరు
- బాలిక మృతదేహం కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు
- నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా వెల్లడి

నందికొట్కూరు, జూలై 16: పది రోజుల క్రితం కనిపించకుండా పోయిన బాలిక వాసంతి కేసులో ఎట్టకేలకు పోలీసులు పురోగతి సాధించారు. నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా మంగళవారం విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. ఈ మేరకు.. ఈనెల 7వ తేదీన సాయంత్రం ఆరు గంటల సమయంలో రద్దీగా ఉన్న పార్కులో వాసంతి ఆడుకుంటోంది. అదే పార్కులో ముగ్గురు బాలురు ఆ బాలికను పార్కులోనే ఉన్న ఓ దేవాలయం వద్దకు తీసుకెళ్లి అత్యాచారం చేశారు. ఆపైన బాలికకు చాక్లెట్లు కొనిచ్చి ఇంటికి వెళ్లమన్నారు. అయితే జరిగిన విషయం బాలిక ఇంట్లో చెబితే తాము చేసిన నేరం బైటపడుతుందని అనుకున్నారు. బాలికను ఇంటి దగ్గర వదులుతామని చెప్పి సైకిల్‌పై ఎక్కించుకొని వనములపాడు వైపు కేసీ కెనాల్‌పై తీసుకెళ్లారు. ముచ్చుమర్రి గ్రామశివారులోని కేసీ కాలువ చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి గొంతునులిమి చంపేశారు. మృతదేహాన్ని పొదల్లో దాచిపెట్టారు. ఆ తర్వాత ఏం చేయాలో తెలియక ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పారు. ఆ ముగ్గురిలో ఒక బాలుడి తండ్రి యోహాన్, మరో బాలుడి పెదనాన్న సద్గురుడు మృతదేహాన్ని మాయం చేసేందుకు వ్యూహం పన్నారు. ఆ ఇద్దరూ కలిసి సంచిలో మృతదేహాన్ని వేసుకొని, ద్విచక్రవాహనంపై వనములపాడు మీదుగా వచ్చి, దిగువ రస్తాలో ముచ్చుమర్రి శివారు ప్రాంతం నుంచి ఎత్తిపోతల పథకం దగ్గరికి వెళ్లారు. అక్కడ మృతదేహానికి రాయి కట్టి నదిలోకి తెప్ప మీద వెళ్లి మధ్యలో నీళ్లలో పడేశారు. దీని వల్ల మృతదేహం ఒండ్రుమట్టిలో కూరుకుపోయి ఉంటుందని, అందుకే ఎన్.డి.ఆర్.ఎఫ్ బృందాలకు కనిపించడం లేదని పోలీసులు చెబుతున్నారు.



వాసంతి (ఫైల్)



సంఘటన వివరాలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య(ఫైల్)

ఓ చిన్నారి ఇచ్చిన సమాచారంతో తీగలాగారు

ఆదివారం సాయంత్రం నుంచి తన కూతురు కనిపించడం లేదని వాసంతి తండ్రి సంగెం మద్దిలేటి ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదే రోజు రాత్రి గ్రామంలో బాలిక తప్పిపోయిందంటూ పోలీసులు దప్పు వేయించారు. సోమవారం నంద్యాల ఎంపీ బైరెడ్డి డా. శబరి నందికొట్కూరులో విజయకేతన సభలో మాట్లాడుతూ గ్రామంలో ఓ బాలిక కనిపించకుండా పోయిందని, ఆమె ఆచూకి 24 గంటల్లో తేల్చాలని ఆమె పోలీసులకు సూచించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు విచారణ చేపట్టారు. కాని సోమవారం ఎలాంటి సాక్ష్యాధారాలను వెతకలేకపోయారు. సాయంత్రం డీఎస్పీ శ్రీనివాసరావు బాధితుల ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. మంగళవారం పోలీసులు విచారణలో ఒక చిన్నారి వాసంతితో కలిసి పార్కుకు వచ్చిందని తేలింది. ఆ బాలికతో పోలీసులు మాట్లాడగా.. ఆ రోజు ముగ్గురు అబ్బాయిలు పార్కులో గొడవ చేస్తుంటే వాచ్‌మెన్ వాళ్లను తిట్టాడని, వారు వాసంతిని కిడ్నాప్ చేస్తామని బెదిరించారని తెలిసింది. ఆ ముగ్గురిని బాలిక గుర్తించింది. పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. అయితే బాలురు మొదట ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం అప్రోచ్ కాలువలో మృతదేహాన్ని పడేశామని చెప్పడంతో రెండు రోజుల పాటు గజఈతగాళ్లతో పాటు, ఏపీ ఎస్‌డిఆర్‌ఎఫ్, ఎన్.డి.ఆర్.ఎఫ్ బృందాలు గాలించాయి. కానీ మృతదేహం కనిపించలేదు. 10వ తేదీన ఎమ్మెల్యే గిత్తా జయసూర్య సంఘటన స్థలానికి చేరుకొని నేరస్తులను వదిలిపెట్టడానికి వీల్లేదని అన్నారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి దోషులను బయటపెట్టాలని పోలీసులపై ఒత్తిడి తీసుకువచ్చారు. అయితే పోలీసుల అదుపులో ఉన్న ముగ్గురు బాలురు పూటకో సమాధానం చెప్పడంతో కాలం గడిచిపోయింది. బాలురలో ఒకరి తండ్రి అయిన యోహాన్ నెలరోజులైనా శవాన్ని గుర్తించలేరని చెప్పినట్లు తెలియడంతో పోలీసులు అతడ్ని అదుపులోకి తీసుకున్నారు. అతడు మృతదేహాన్ని కృష్ణానదిలో పడేశామని చెప్పడంతో అక్కడ గాలింపు చర్యలు చేపట్టారు. కాని వాసంతి మృతదేహం లభ్యం కాలేదు. గాలింపు చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి.



బాధితులను పరామర్శిస్తున్న నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి(ఫైల్)

ముగ్గురిపై పోక్సో కేసు.. మరో ఇద్దరికి రిమాండ్

బాలికను అత్యాచారం చేసి హత్య చేసిన ముగ్గురు మైనర్లపై పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేసి కర్నూలు జువైనల్ హోంకు తరలించారు. అదేవిధంగా బాలురు చేసిన తప్పును సమర్థిస్తూ బాలిక మృతదేహాన్ని మాయం చేసిన కేసులో యోహాన్, సద్గురుడులను అరెస్టు చేసి కోర్టు ఆదేశాల మేరకు నందికొట్కూరు సబ్‌జైల్‌లో రిమాండ్‌కు తరలించారు. ఇదిలా ఉండగా వాసంతి మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని, కేసు బలోపేతం కోసం సాక్షాలను సేకరిస్తున్నట్లు ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా వెల్లడించారు. ఈ కేసులో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేవని, కేవలం చిన్నారులు చేసిన తప్పును తలిదండ్రులు కప్పిపుచ్చుకునేందుకే శవాన్ని మాయం చేశారని తెలిపారు. ఈ సమావేశంలో కేసును విచారించిన ఎస్పీ రఘువీర్‌రెడ్డి, ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

లభించని వాసంతి మృతదేహం: గత పది రోజుల క్రితం కనిపించకుండా పోయిన వాసంతి మృతదేహం ఇంత వరకు లభ్యం కాలేదు. ఘటన జరిగి పదిరోజులు అవుతున్నా మృతదేహం కనిపించకపోవడంతో ఇక కనిపిస్తుందన్న నమ్మకం లేదని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

నిందితులకు శిక్ష పడేలా చేస్తాం: ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల క్రైం, జూలై 16: తాను నంద్యాల ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ముచ్చుమర్రి వాసంతి మిస్సింగ్ కేసు మొదటిదని అధిరాజ్ సింగ్ రాణా అన్నారు. ఈ కేసులో విచారణ జరుగుతోందని, మృతదేహం కోసం గాలింపు చర్యలు కొనసాగుతాయన్నారు. సాక్ష్యాలను సేకరిస్తున్నామన్నారు. ఈ కేసులో అత్యాచారం చేసి, హత్య చేసినట్లు ముగ్గురు బాలురు ఒప్పుకున్నారని అన్నారు. వారిలో ఒక బాలుడి తండ్రి, మరో బాలుడి పెద్దనాన్న కలిసి వాసంతి మృతదేహాన్ని కృష్ణానదిలో పడేసినట్లు ఒప్పుకున్నారని ఎస్పీ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీలు అధిరాజ్ సింగ్ రాణా, రఘువీర్ రెడ్డి

ఆసుపత్రుల అభివృద్ధికి సహకరించాలి

వైద్య ఆరోగ్యశాఖ మంత్రిని కలిసి ఎంపీ

కర్నూలు(అర్బన్), జూలై 16: జిల్లాలో ఆసుపత్రుల అభివృద్ధికి సహకరించాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు కోరారు. మంగళవారం విజయవాడలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. జిల్లాలోని పలు ఆసుపత్రులు, జిల్లా కేంద్రంలోని పెద్దాసుపత్రులపై తీసుకోవాల్సిన చర్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి అంశాలపై చర్చించారు.



మంత్రిని కలిసిన ఎంపీ

- **కనకదుర్గమ్మను దర్శించుకున్న ఎంపీ:** విజయవాడలోని కనక దుర్గమ్మను కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో అర్చకులు, అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను, చిత్రపటాన్ని అందజేశారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 16: జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తుల గడువును ఈ నెల 18వ తేదీ వరకు పొడిగించారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి కె.శామ్యూల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు యువకుల దుర్మరణం

- వేర్వేరు ప్రాంతాల్లో ఘటనలు
- ద్విచక్రవాహనాల్లో వెళ్తుండగా రోడ్డు ప్రమాదాలు

పత్తికొండ, జూలై 16: కర్నూలు జిల్లాలో మంగళవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు దుర్మరణం పాలయ్యారు. పత్తికొండ మండలంలో ఇద్దరు, దేవనకొండలో మరో యువకుడు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా.. పత్తికొండ మండలపరిదిలోని దూదేకొండ దూదేకొండ గ్రామానికిచెందిన బడెద్దులక్రిష్ణ కొడుకు సురేష్(18) డెకరేషన్ పనులకు వెళ్తూ తండ్రికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. అదేగ్రామానికి చెందిన దొడ్డిగోపాల్ పెద్దకొడుకు మణికుమార్ (18) పత్తికొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్నాడు. గ్రామంలో రెండురోజులుగా జరుగుతున్న మొహరం వేడుకల్లో సురేష్, మణి ఇద్దరు ఉత్సాహంగా పాల్గొన్నారు. మంగళవారం పెద్దసరిగెత్తుకోసం రాత్రికి ఆడే సావ్‌నేస్‌లో ప్రత్యేకంగా కనిపించేందుకు కొన్నివస్తువుల కోసం ద్విచక్ర వాహనంపై పత్తికొండకు వెళ్లారు. తిరిగి గ్రామానికి వెళ్తుండగా సుకలినాగమ్మ గుడివద్ద ప్రమాదవశాత్తు ఎద్దులబండిని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఆ ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.




మణికుమార్(ఫైల్)




సురేష్ (ఫైల్)

అక్కను చూసి వస్తూ...



ప్రమాద తీవ్రతకు రెండు భాగాలుగా విడిపోయిన ద్విచక్ర వాహనం



మృతి చెందిన యువకుడు

దేవనకొండ: తోడబుట్టిన సోదరిని చూసేందుకు వెళ్లి వస్తుండగా ఓ యువకుడు రోడ్డుప్రమాదంలో మృతి చెందిన సంఘటన దేవనకొండలో చోటు చేసుకుంది. గోనేగండ్ల మండలం వర్కూరు గ్రామానికి చెందిన పాపారాయుడు, అంజినమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు సంతానం. వీరిలో చిన్న కుమారుడు మునెప్ప (19) మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దేవనకొండ మండలంలోని పి.కోటకొండలో ఉన్న ఇద్దరు అక్కలను చూసి వర్కూరుకి ద్విచక్ర వాహనంపై తిరుగుప్రయాణమయ్యాడు. వీరంపల్లి స్టేజీ సమీపంలోకి రాగానే కర్నూలు నుండి బళ్లారి వైపు వెళ్తున్న లారీ మునెప్ప బైక్‌ను వేగంగా ఢీకొట్టింది. దీంతో యువకుడు అక్కడిక్కడే దుర్మరణం పాలయ్యాడు. ద్విచక్రవాహనం సైతం రెండు భాగాలుగా ధ్వంసమైంది. ప్రమాదంపై దేవనకొండ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

సుంకేశ్వరిలో తగ్గిన అతిసార

- ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా
- 24/7 గంటలు ఉచిత వైద్య శిబిరం



వైద్యశిభిరం నిర్వహిస్తున్న వైద్యులు, అధికారులు

మంత్రాలయం, జూలై 16: మంత్రాలయం మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో విజృంభించిన అతిసార మంగళవారం సాయంత్రానికి తగ్గుముఖం పట్టింది. వైద్యులు సోమవారం నుంచి మంగళవారం రాత్రి వరకు ఇల్లిల్లు తిరిగి అస్వస్థతకు గురైన వారికి వైద్యచికిత్సలు అందించారు. మెరుగైన వైద్యసేవల కోసం 15 మందిని ఎమ్మిగనూరు, ఆదోని ఆసుపత్రులకు తరలించారు. అధికారులు గ్రామంలో అపరిశుభ్రంగా ఉన్న సీసీ రోడ్లు, మురికి కాలువలను శుభ్రం చేసి నీటి సరఫరాను బంద్ చేసి, తాగునీటి బోర్లను తొలగించారు.



అధికారులతో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో

ఆశాలు, వైద్యసిబ్బందిపై జడ్పీ సీఈవో నాసరరెడ్డి ఆగ్రహం

మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో అతిసార విజృంభించి ఒక చిన్నారి బాలిక మృతి చెందడం, 70 మంది అస్వస్థతకు గురి కావడంతో ఆశా వర్కర్లు, వైద్య సిబ్బందిపై జడ్పీ సీఈవో నాసరరెడ్డి, డీఎంహెచ్‌వో ప్రవీణ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం గ్రామంలో పర్యటించి పరిశుభ్రత, తాగునీరు, రోగులను పరామర్శించి ఉచిత వైద్యశిబిరాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడు రోజుల పాటు 24 గంటల వైద్యశిబిరం కొనసాగుతుందని అన్నారు. ఎవరూ ఆందోళనలు చెందకుండా సచివాలయంలోని వైద్యబృందం దగ్గర చికిత్సలు తీసుకోవాలని తెలిపారు. గ్రామంలో పిల్లలను, వృద్దులను వైద్యశిబిరానికి తీసుకురావడంలో ఆశాలు, వైద్యసిబ్బంది నిర్లక్ష్యంగా ఉండటంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముకురన్న, ఎంపీడీవో మునెప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేద స్వరూప, ఈవోఆర్‌డీ ప్రభావతిదేవి, వీఆర్వో ఆనంద్, కార్యదర్శి చిరంజీవి, డాక్టర్లు సురేష్, వసంతమ్మ, నాయకులు రోగెప్ప, శ్రీనివాసులు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత మంచినీరు సరఫరా

గ్రామంలో నీటి బోర్ల ద్వారా సరఫరా చేసే నీటి పైపులను తొలగించి ప్రత్యేక వాటర్ ట్యాంకర్ల ద్వారా ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరెడ్డి, ఏఈ వేద స్వరూప దగ్గరుండి సురక్షిత నీటిని ఆయా కాలనీలో సరఫరా చేశారు. దీంతో గ్రామస్థులు వారి ఇంటి వద్ద తాగునీటిని పట్టుకుని పలు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు.



గ్రామంలో ట్యాంకర్ల ద్వారా మంచినీరు సరఫరా చేస్తున్న అధికారులు

సుంకేశ్వరి పంచాయితీ కార్యదర్శికి నోటీసులు

కర్నూలు(కలెక్టరేట్), జూలై 16: విధుల పట్ల నిర్లక్ష్యం వహించినందుకు మంత్రాలయం మండలం సుంకేశ్వరి గ్రామ పంచాయతీ కార్యదర్శికి డీపీఓ నాగరాజునాయుడు మంగళవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయితీల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని, తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయాలని ఆదేశాలు జారీ చేసినా కూడా పంచాయితీ కార్యదర్శులు నిర్లక్ష్యం వహిస్తున్నారనీ పేర్కొన్నారు. సుంకేశ్వరి గ్రామ పంచాయితీలో పారిశుద్యం లోపం కారణంగా గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి కావడం జరిగిందన్నారు. పారిశుద్యంపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



మాట్లాడుతున్న డీపీఓ నాగరాజు నాయుడు

ఏపీపీఈడబ్ల్యూఏ ప్రచార కమిటీ ఛైర్మన్‌గా పాల్‌రాజ్



పాల్‌రాజ్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ రాష్ట్ర నాయకులు

కర్నూలు(కల్చరల్), జూలై 17: ఏపీ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ (ఏపీపీఈడబ్లూఏ) సమాచార ప్రచార కమిటీ ఛైర్మన్‌గా కర్నూలుకు చెందిన పాల్‌రాజ్ ఎంపికయ్యారు. మంగళవారం విజయవాడలోని స్వర్ణ ప్యాలెస్ హోటల్ సమావేశ హాలులో ఏపీ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ 16వ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సమాచార ప్రచార కమిటీ ఛైర్మన్‌గా పాల్‌రాజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాల్‌రాజ్ మాట్లాడుతూ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్‌కు అనేక సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి యూనియన్ రాష్ట్ర నాయకులు కృషి చేయాలని కోరారు. అలాగే ఎలక్ట్రీషియన్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకుపోయి తనవంతుగా వాటి పరిష్కారానికి పాటుపడతానని చెప్పారు. అసోసియేషన్‌లో పాల్‌రాజ్ సమాచార ప్రచార కమిటీ ఛైర్మన్‌గా ఎంపిక కావడంపై అసోసియేషన్ నాయకులు ఆయనను అభినందించారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

సి.బెళగల్, జూలై 16: మండలంలోని తిమ్మనదొడ్డి గ్రామానికి సమీపంలోని తుంగభద్రనదిలో నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న టీ చామలగూడూరుకు చెందిన మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసి సీజ్ చేసినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నదీతీర గ్రామాలలో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే వదిలే ప్రసక్తి లేదన్నారు. అలాగే గ్రామాలలో మద్యం, పేకాట, గుట్కా వంటివి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

రాఘవేంద్రస్వామి మఠంలో హుండీ చోరీ

మంత్రాలయం, జూలై 16: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పరిధిలోని రైల్వేస్టేషన్ తుంగభద్ర శ్రీమఠంలో హుండీ చోరీకి గురైంది. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు శ్రీమఠం ప్రధాన ద్వారాన్ని పగులకొట్టి లోపలికి వెళ్లి హుండీకి ఉన్న రెండు తాళాలను ధ్వంసం చేశారు. అందులోని నగదును అపహరించుకువెళ్లారు. మంగళవారం ఉదయం ఆలయం తెరిచి పూజలు చేసేందుకు వెళ్లిన ఆ మఠం మేనేజర్ పురిడి నాగేశాచార్ సమాచారాన్ని మంత్రాలయం మఠం అధికారులకు తెలియజేశారు. మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషిల సూచన మేరకు మంత్రాలయం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న మాధవరం ఎస్ఐ కృష్ణమూర్తి ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ హుండీని గత మార్చి 31 వరకు లెక్కించినట్లు మఠం మేనేజర్ తెలిపారు. ఏప్రిల్, మే, జూన్ మూడున్నర నెలల హుండీ ఆదాయం చోరీ జరిగిందని, దాదాపు రూ.30వేలకు పైగానే నగదు ఉంటుందన్నారు.



హుండీ పగులకొట్టిన దృశ్యం

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

వర్షం కోసం గంగమ్మకు పూజలు



పాములపాడులో వర్షం కోసం కప్పను ఊరేగిస్తున్న దృశ్యం

పాములపాడు, జూలై 16: సకాలంలో వర్షాలు కురువాలని పంటలు సమృద్ధిగా పండాలని గంగమ్మ దేవతకు భక్తి శ్రద్ధలతో గ్రామ రైతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం పాములపాడులో రైతుల ఆధ్వర్యంలో కర్రకు వేప మండలు కట్టి కప్పను వేలాడదీసి తప్పెట్లతో గ్రామంలో ఊరేగించారు. వరుణుడు కరుణించి వర్షాలు కురిసి పంటలు బాగ పండాలని గంగమ్మను ప్రార్థించారు.

విద్యార్థినికి సైకిల్ పంపిణీ



విద్యార్థినికి సైకిల్ అందజేస్తున్న ఎన్ఎండి ఫిరోజ్

నంద్యాల (నూనెపల్లె), జూలై 16: 33వ వార్డుకు మిషన్ కాంపౌండ్‌కు చెందిన అభిషేకమ్మ కుమార్తె మాధురి 10వ తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చేరింది. రోజు కళాశాల వెళ్లేందుకు ఇబ్బందులు పడుతుండడంతో సెవెన్‌హిల్స్ హాస్పిటల్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ స్పందించి సైకిల్ పంపిణీ చేశారు. మంగళవారం టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ విద్యార్థినికి సైకిల్‌ను అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ దస్తగిరి ఉస్మాన్ బాషా, ప్రేమ్‌కుమార్, మారుతి కుమార్, టీడీపీ నాయకులు సురేష్, విజయానంద్ బుగ్గారాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు మీడియాన్ని కొనసాగించాలి



మాట్లాడుతున్న సాంబశివుడు

నంద్యాల (నూనెపల్లె), జూలై 16: రాష్ట్రంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంతో పాటు తెలుగు మీడియంను కూడా కొనసాగించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకాడమిక్ కమిటి సభ్యుడు సాంబశివుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం నంద్యాలలోని జిల్లా కార్యాలయంలో జరిగిన ఏపీటీఎఫ్ సమావేశంలో వారు మాట్లాడారు. 2025 మార్చిలో జరిగే 10వతరగతి పబ్లిక్ పరీక్షలను విద్యార్థులు కేవలం ఇంగ్లీష్ మీడియంలోనే రాయాల్సి ఉంటుందని ముఖ్యంగా గ్రామీణ ప్రాంత పేద, దళిత వర్గాల విద్యార్థులు తెలుగు మీడియం లేక పోవడం వల్ల ఇంగ్లీష్ మీడియంలో చదవ లేక వారి భవిష్యత్తు అగమ్య గోచరంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పాఠశాలలో తెలుగు మీడియంను మైనర్ మీడియంను కొనసాగించాలని డిమాండ్ చేశారు.

ఎంప్లాయిస్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

ఆత్మకూరు, జూలై 16: ఆత్మకూరు ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్‌ను నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక గణేష్ లాడ్జిలో ఆ సంఘం రీజనల్ కార్యదర్శి ఆర్ఎస్ రావు, రీజనల్ అధ్యక్షులు శివారెడ్డి సమక్షంలో జరిగిన ఈ ఎన్నికలో డిపో కార్యదర్శిగా గుజరాతి శ్రీనివాసులు, అధ్యక్షుడిగా వీఆర్‌కే నాయక్, కోశాధికారిగా పీఎస్ బాబులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కేఎంరావు, ఎండీ. రఫీక్, వెంకటేశ్వర్లు, సుబ్బయ్య, రాముడు, మహానందప్ప ఉన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూరు, జూలై 16: రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దినేష్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వాలు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు మేలు చేసేలా నిర్ణయాలు తీసుకోవడం వల్ల విద్యను వ్యాపారంగా మార్చేశారని మండిపడ్డారు. దీనివల్ల వల్ల బడుగు, బలహీన, పేద వర్గాలకు విద్య అందని ద్రాక్షగా మారే ప్రమాదం ఉందని అన్నారు. అలాగే అందరికి ఉచిత విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో డిగ్రీ కళాశాలల్లో బీకామ్ కోర్సులను కొనసాగించాలని అన్నారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు రాజు, సాయి, దిలీప్, లింగేష్‌బాబు తదితరులు ఉన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరు రూరల్, జూలై 16: సీజనల్ వ్యాధుల పట్ల గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని బైర్లూటి పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాల్ పేర్కొన్నారు. మంగళవారం అమలాపురం గూడెంలో ఆయన వైద్య సిబ్బందితో కలిసి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా రక్షణ చర్యలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించి గిరిజనుల్లో జ్వరపీడితుల రక్తనమూనాలు సేకరించారు. చిరు వ్యాధులకు చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కాచి వడబోసిన నీటినే తాగాలని, తప్పనిసరిగా దోమతెరలు వాడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సబ్‌యూనిట్ ఆఫీసర్ కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి చాణక్య, సీహెచ్‌వో రజిత ఆరోగ్య కార్యకర్త మహేశ్వరమ్మ పాల్గొన్నారు.

వాసంతి మృతదేహం గాలింపు చర్యలపై ఎస్పీ ఆరా

పగిడ్యాల, జూలై 16: మండల పరిధిలోని ముచ్చుమర్రి గ్రామానికి చెందిన వాసంతి అనే బాలికను హత్య చేసి ఎత్తిపోతల పథకంలోని అప్రోచ్ కాల్వలో పడవేసినట్లు నిందితులు చెప్పడంతో మంగళవారం సాయంత్రం ఎత్తిపోతల పథకాన్ని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పరిశీలించారు. కాల్వలో చేపట్టిన గాలింపు చర్యల వివరాలను ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎస్ బలగాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అడిషనల్ ఎస్పీ ప్రవీణ్ కుమార్, ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు ఉన్నారు.

నిందితులను వదిలిపెట్టే ప్రసక్తే లేదు

వాసంతి హత్యలో నిందితులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని, వారికి చట్ట ప్రకారం శిక్ష పడేలా చర్యలు తీసుకుంటాని అడిషనల్ ఎస్పీ ప్రవీణ్ కుమార్ అన్నారు. హత్య కేసులో నిందితులుగా ఉన్న ముగ్గురు మైనర్ బాలురను పోలీస్‌లు స్టేట్‌మెంట్ రికార్డు కోసం మంగళవారం ఉదయం గ్రామానికి తీసుకొనివచ్చి విచారణ చేశారు. గ్రామంలోని కేసీ కాలువ, పార్కు సమీపంలో వారిని విచారించారు. గ్రామానికి నిందితులను తీసుకొనిరావడంతో భారీ పోలీలులు మోహరించారు. ఆయన వెంట ఎస్ఐ జయశేఖర్, సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై
అధికారులు చర్యలు చేపట్టాలి

● ఎమ్మెల్యే గౌరు చరిత



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

పాణ్యం, జూలై 16 : ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై అధికారులు చర్యలు చేపట్టాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత ఆదేశించారు. మంగళవారం పాణ్యం మండల సర్వసభ్య సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పాణ్యం బస్టాండులో బనగానపల్లె రోడ్డులోని ఆర్‌అండ్‌బీ స్థలాన్ని ఆక్రమించి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని ఫిర్యాదులు అందాయని, దీనిపై అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ రహదారి స్థలాలను ఆక్రమించిన వారిపై చర్యలు తప్పవన్నారు. చెంచుకాలనీలో ప్రభుత్వ భవనాలలో నివాసముంటున్న కుటుంబాలను వెంటనే ఖాళీ చేయించాలని ఈఓఆర్‌డీ సులోచనను ఆదేశించారు. పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహారీ ఎందుకు పూర్తి కాలేదో నివేదిక ఇవ్వాలని ఎంఈవోను కోరారు. కబ్జాలకు గురైన ప్రభుత్వ స్థలాలపై ప్రత్యేక నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. సర్వసభ్య సమావేశానికి హాజరయ్యే అధికారులు తమ వెంట పూర్తి వివరాలతో హాజరు కావాలని, సమస్యలు తెలియకుండా సభకు హాజరు కారాదని హెచ్చరించారు. గ్రామాలలో తాగునీరు, విద్యుత్, పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మండలంలోని ఐదు చెరువుల మరమ్మతులకు ప్రతిపాదనలు తయారు చేశామని ఎంఐ ఏఈ అర్జున్‌సింగ్ తెలిపారు. పాణ్యం ఊరిముందరి చెరువుకు రూ. 11 లక్షలు, కొండజూటూరు చెరువుకు రూ. 2. 8 లక్షలు, వడ్డుగండ్ల చెరువుకు రూ. 5. 5 లక్షలు, భూపనపాడు చెరువుకు రూ. 2. 2 లక్షలు, ఆలమూరు చెరువుకు రూ. 2. 2 లక్షలతో ప్రతిపాదనలు పంపించామన్నారు. పశు వైద్యశాల భవనాలు అధ్వానంగా ఉన్నాయని, నిధులు మంజూరు చేసి మరమ్మతు చేయాలని పశు వైద్యాధికారి డాక్టర్ సులోచన కోరారు. అన్ని సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉసేన్‌బీ, జడ్పీటీసీ సభ్యురాలు సరళమ్మ, ఎంపీడీవో భాగ్యలక్ష్మి, తహసీల్దారు ఫణికుమార్,

ఘనంగా రాష్ట్రస్థాయి పశు ప్రదర్శన పోటీలు ప్రారంభం

మండలంలోని గోరుకల్లులో మొహర్రం సందర్భంగా పెద్దస్వామి, దాల్‌స్వామి దర్గా వద్ద ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి పశు ప్రదర్శన పోటీలను మంగళవారం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో వివిధ ప్రాంతాలకు చెందిన వృషభాలు పాల్గొన్నాయి. పోటీలలో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ. 40 వేలు. ద్వితీయ రూ. 30 వేలు. తృతీయ రూ. 20 వేలు, నాలుగో బహుమతిగా రూ 10వేలు అందజేశారు. మొహర్రం సందర్భంగా లాల్‌స్వామి, డాల్‌స్వామి దర్గా వద్ద భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. సరిగెత్తు కార్యక్రమంలో భాగంగా నెల్లూరు బృందం కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో



పెసరవాయి గ్రామంలో పీర్లకు ప్రత్యేక పూజలు చేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత

పాణ్యంసీఐ నల్లప్ప, ఎస్ఐ అశోక్, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాణ్యం నియోజకవర్గ అభివృద్ధికి కృషి

గడివేముల, జూలై 16: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకారంతో పాణ్యం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. మండలంలోని పెసరవాయి గ్రామంలో మంగళవారం మొహర్రం వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఫాతెహాలు సమర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గడివేములలో భారీ వాహనాల రాకపోకల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను, అలగనూరు రిజర్వాయర్ మరమ్మతులపై సీఎంతో చర్చించామని అన్నారు. సీఎం సానుకూలంగా స్పందించారని అన్నారు. గడివేములలో బైపాస్ రోడ్డు నిర్మించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, వడ్డు లక్ష్మీదేవి, వడ్డు ప్రశాంతి, ఈశ్వర్‌రెడ్డి, పంట రామచంద్రారెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, కృష్ణయాదవ్, గిరిబాబు, హర్ష, సుభద్రమ్మ, కెవి మల్లికార్జున పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించాలి

ఆత్మకూరు రూరల్, జూలై 16: మండలంలో కుష్టు వ్యాధి గ్రస్థులను గుర్తించాలని ఎంపీడీవో శివప్రసాదవర్మ, వైద్యాధికారి పవన్‌కుమార్‌లు ఆరోగ్యసిబ్బందికి సూచించారు. మంగళ వారం ఆత్మకూరు పట్టణంలోని ఎంపీడీవో సమావేశ భవనంలో ఏఎన్ఎంలు, ఆశాలు, వలంటీర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారికి పలు సూచనలు చేశారు. వారు మాట్లాడుతూ..ఈ నెల 18వ తేదీ నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆయా గిరిజన గూడేలు, గ్రామాలలో కుష్టు వ్యాధి గ్రస్థుల సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. స్పర్శ లేని మచ్చలు, కాళ్ళు చేతులతో స్పర్శ లేకపోవడం,కాళ్ల నుంచి చెప్పులు జారి పోవడం ,చర్మం నూనె పూసినట్లు ఉండటం, కనుబొమ్మలు రాలి పోవడం, కుష్టు వ్యాధి లక్షణాలన్నారు. తదితర లక్షణాలు కలిగిన వారిని అనుమానితులుగా గుర్తించి వారికి ఈ కుష్టు వ్యాధి పరీక్షలు నిర్వహించాలని సూచించారు.ఆయా గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది పర్యటించి ఎప్పటికపుడు వైద్యాధికారులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఖుద్దూస్ బాషా, సూపర్‌వైజర్ రమణమ్మ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

కామేశ్వరిదేవికి సారె



వేదపండితులకు ఆషాడం సారెను అందజేస్తున్న మహిళలు

మహానంది, జూలై 16: మహానంది క్షేత్రంలోని కామేశ్వరీదేవి అమ్మవారికి ఆషాడ మాసం సారెను మహిళలు భక్తి శ్రద్ధలతో అందచేసారు. మంగళవారం ఆషాడమాసం శుక్లపక్ష దశమి సందర్భంగా మహానంది దేవస్థానం సిబ్బంది కాలనీ, ఈశ్వర్‌నగర్ కాలనీకి చెందిన మహిళలు ఆషాడం పట్టిని సమర్పించారు. పసుపు, కుంకుమలతో పాటు వివిధ రకాల పుష్పాలు, పిండివంటలు, పట్టుచీరలతో సౌభాగ్య ద్రవ్యాలను మహిళలు తీసుకొని వచ్చి వేదపండితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ఆర్య వైశ్య మహిళా సంఘానికి యాడికి శ్రీదేవి, బుక్కాపురం సుబ్బారావు, చండీదేవితో పాటు రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగ్ కార్యవర్గ సభ్యురాలు మునగనూరి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

జగజ్జననికి పుట్టింటి సారె



సారె తీసుకొస్తున్న మహిళలు

నంద్యాల (కల్చరల్), జూలై 16: నంద్యాల జగజ్జననీ అమ్మవారికి ఆషాడ మాసం సందర్భంగా భక్తులు అమ్మవారికి చీరె సారె సమర్పించారు. మంగళవారం 11వరోజు ఆషాడమాసం సందర్భంగా జగజ్జననీ అమ్మవారికి బెంగుళూరు, రాజంపేట, మేడ్చల్, ఆదోని, కర్నూలు, గుంటూరు,జమ్మలమడుగు,నిమ్మకూరు,ఎమ్మిగనూరుకు చెందిన భక్తులు అమ్మవారికి పుట్టింటి చీరె సారె తీసుకొని వచ్చి సమర్పించారు.

వెలుగోడులో రేషన్ బియ్యం పట్టివేత

వెలుగోడు, జూలై 16: వెలుగోడు పట్టణంలో మంగళవారం ప్రజా పంపిణీకి చెందిన 130 ప్యాకెట్ల బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న బియ్యం, లారీని పోలీసులు చుట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ భూపాలుడు తెలిపారు. వీఆర్‌వో చక్రధర్, అన్వర్‌లు అక్కడికి చేరుకుని బియ్యాన్ని పరిశీలించారు. అనంతరం పంచనామా నిర్వహించి రెవెన్యూ అధికారులకు బియ్యాన్ని అప్పగించారు. అనంతరం ఆ బియ్యాన్ని ఆత్మకూరులోని స్టాక్ పాయింట్‌కు తరలించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న షేక్ మహ్మద్, మంజుల సురేంద్రలపై కేసు నమోదు చేసి లారీని సీజ్ చేసినట్లు తెలిపారు.

డిప్యూటీ తహసీల్దార్‌పై ఆర్డీవో ఆగ్రహం



ముచ్చుమర్రి సచివాలయంలో మాట్లాడుతున్న ఆర్డీవో దాసు

పగిడ్యాల, జూలై 16: పగిడ్యాల డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆత్మకూరు ఆర్డీవో దాసు మండిపడ్డారు. పాత ముచ్చుమర్రి సచివాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు.డి ప్యూటీ తహసీల్దార్ సమయవేళలు పాటించకపోవడంతో పాటు ప్రజా వేదికలో వచ్చిన వినతుల పరిష్కారం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ముచ్చుమర్రిలో బాలిక హత్య సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిందని, జిల్లాస్థాయి అధికారులు సైతం వారం రోజులుగా ఇక్కడే ఉంటూ గాలింపు చర్యలు చేపడుతున్నారని, డిప్యూటీ తహసీల్దార్ మాత్రం ఇటువైపు రాకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.

పారిశుధ్యం పనులు చేపట్టండి

హత్యకు గురైన బాలిక వాసంతి కుటుంబాని పరామర్శించేందుకు బుధవారం హోంమంత్రి ముచ్చుమర్రికి వస్తుండడంతో పారిశుద్యం పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శికి ఆర్డీవో సూచించారు. బాలిక ఇంటి వద్ద, పార్కులో పారిశుధ్యం పనులు చేయించాలన్నారు. రోడ్డు వెంట ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని తెలిపారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు

శ్రీశైలం, జూలై 16: శ్రీశైలం మహాక్షేత్రంలో మంగళవారం లోకకళ్యాణార్థం ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్య (కుమారస్వామి) స్వామికి, నందీశ్వరస్వామికి, బయలు వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో దేశం శాంతిసౌభాగ్యాలతో విరిసిల్లాలని అర్చకస్వాములు సంకల్పం పఠించారు, అనంతరం పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిస్వామికి పూజలు చేశారు.

● ఆకట్టుకున్న పేరిణి నృత్య ప్రదర్శన

శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో మంగళవారం సికిందరాబాద్‌కు చెందిన లక్ష్మీ గణపతి కల్చరర్ ఆర్గనైజేషన్ బృందంచే సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మహాగణపతిం, వినాయకకౌత్వం, శివతాండవం తదితర గీతాలకు భువనేశ్వరీదేవి, నవ్య, మనుశ్రీ, లక్ష్మీ ప్రసన్న, ప్రణీత, అశ్విని, హర్షిత తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

కౌలు రైతుల అభ్యున్నతికి కార్డులు



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీ కృష్ణ

గడివేముల, జూలై 16: కౌలు రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కౌలు కార్డులు మంజూరు చేస్తుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ అన్నారు. మండలంలోని చిందుకూరు గ్రామంలో మంగళవారం ఆయన సోయాబీన్ పంటను పరిశీలించారు. పంటకు పురుగులు ఆశించాయని, నివారణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కౌలు కార్డుల వల్ల కౌలు రైతులకు రుణ అర్హత పొందవచ్చని అన్నారు. అలాగే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో మద్దతు ధరపై పంటను విక్రయించవచ్చని అన్నారు. పంట బీమా, పంట నష్ట పరిహారం పొందేందుకు కౌలు కార్డులు తప్పనిసరి అన్నారు. ప్రతి ఒక్క కౌలు రైతు కౌలు కార్డులు తీసుకోవాలని అన్నారు. మండలానికి 1,025 కౌలు కార్డులు మంజూరు చేశారని, కౌలు కార్డులు కావాల్సిన రైతులు రెవెన్యూ సిబ్బందిని సంప్రదించి సరైన ధ్రువీకరణ పత్రాలను అందజేయాలని అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి హేమసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కౌలు రైతులకు సహాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

పాములపాడు: వ్యవసాయం చేసే కౌలు రైతులకు ఆర్థిక సాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వైవి మురళిక్రిష్ణ, ఏడీఏ ఆంజనేయ అన్నారు. మంగళవారం పాములపాడులోని వ్యవసాయశాఖ కార్యాలయంలో మండల వ్యవసాయశాఖ అధికారి ఫణీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కౌలురైతు కార్డుల సమావేశంలో వారు వీఆర్వోలు, వ్యవసాయ సిబ్బందితో మాట్లాడుతూ సకాలంలో కౌలురైతులకు కౌలు కార్డులు అందించాలని సూచించారు మండలంలో 750 మంద రైతులకు అందించాల్సి ఉండగా 150 కార్డులు మాత్రమే అందించారని రానున్న 10 రోజుల్లో కార్డులు అందించాలని తెలిపారు.

మిడుతూరు: ప్రతి కౌలు రైతుకు కౌలు కార్డు త్వరిత గతిన అందేలా చూడాలని డిఏఓ వైవి మురళి కృష్ణ , ఏడీఏ విజయశేఖర్ మిడుతూరు తహసిల్దార్ తులశమ్మకు సూచించారు. మంగళవారం తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్‌తో గ్రామ రెవెన్యూ అధికారుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో డీఏవో మాట్లాడుతూ కౌలు రైతులకు త్వరితగతిన కౌలు కార్డులు అందజేయాలని అన్నారు. వాటి వల్ల రైతులకు అన్నదాత సుకీభవ, పంటనష్ట పరిహారం, పంట రుణాలు అందుతాయని తెలిపారు.

ఆశ్రమ పాఠశాలల్లో
విద్యార్థుల నమోదు శాతం పెంచాలి

● కలెక్టరు రాజకుమారి



విద్యార్థులతో కలిసి భోంచేస్తున్న కలెక్టరు

పాణ్యం, జూలై 16 : ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచాలని నంద్యాల కలెక్టరు రాజకుమారి ఆదేశించారు. మండలంలోని నెరవాడ మెట్ట సమీపంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలను మంగళవారం ఆమె ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పాఠశాలలో గుణాత్మక విద్య నందించి విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలని ప్రిన్సిపాల్ మేరీ సమలోమిని ఆదేశించారు. ఖాళీ సీట్లు భర్తీ చేయాలన్నారు. గిరిజన ప్రాంతాలకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పిల్లలను పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. మెనూ ప్రకారం ఆహారం అందించాలని సూచించారు. తాగునీటి వసతులు, మౌలిక సదుపాయాల కల్పనలో లోటుపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పాఠశాల గదులు పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించి సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. పాఠశాలకు రెండు డార్మెంటరీలు, ఇన్వర్టర్, జనరేటర్, మస్కిటో మెష్ సౌకర్యాలు కల్పించాలని ప్రిన్సిపాల్ కలెక్టరును కోరారు. స్పోర్ట్స్ మైదానాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీ వ్యాధిపై అవగాహన ర్యాలీ

మహానంది, జూలై 16: మండలంలోని ఎం.తిమ్మాపురం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి భగవాన్‌దాస్, ఎంపీహెచ్ఈఓ ఉసేన్‌రెడ్డిల ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది డెంగీ వ్యాధిపై అవగాహన ర్యాలీని మంగళవారం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ ప్రజలు దోమలు కుట్టకుండా దోమతెరలు ఉపయోగించడంతో పాటు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా అనుపమ



నందికొట్కూరు, జూలై 16: నందికొట్కూరు మున్సిపల్ నూతన కమిషనర్‌గా అనుపమ బాధ్యతలు చేపట్టారు. గతంలో పని చేసిన సుధాకర్‌రెడ్డి లాంగ్ లివ్‌లో వెళ్లడంతో ఆదోని మున్సిపాలిటీలో అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న అనుపమకు పూర్తి అదనపు బాధ్యతలతో నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆమె మంగళవారం బాధ్యతలు చేపట్టారు. మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. విధుల పట్ల అశ్రద్ధ లేకుండా అప్రమత్తంగా ఉండాలని ఆమె సిబ్బందికి సూచించారు.

రైతులకు అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగరాజు

నంద్యాల రూరల్, జూలై 16: రైతులకు అధిక దిగుబడులు, మార్కెటింగ్ సదుపాయాలపై అవగాహన పెంచాలని జిల్లా ఉద్యానశాఖాధికారి నాగరాజు సూచించారు. మంగళవారం నంద్యాల ఉద్యానశాఖ కార్యాలయంలో ఉద్యాన, వ్యవసాయ, డిజిటల్ గ్రీన్‌సంస్థ సంయుక్తంగా నంద్యాల, ఆళ్లగడ్డ డివిజన్ మండలాల ఉద్యాన, వ్యవసాయశాఖ అధికారులకు ఈ-మిర్చి 20 ప్రాజెక్టుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా నాగరాజు మాట్లాడుతూ మిరప పంటలో భూసార పరీక్షలు, కారం నాణ్యత పరీక్షలు, మార్కెటింగ్ అనుసంధానం తదితర అంశాలపై సూచించారు. ఉద్యానశాఖ ద్వారా లబ్ధిచేకూరే వివిధ పథకాలను, మిరప పంటలోని వివిధ రకాల ఉపయోగాలను, పంటలపై చీడపీడల నివారణ, సమగ్ర సస్యరక్షణ పద్ధతులను వివరించారు. సాంకేతిక పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. వ్యవసాయంలో మెలకువలను పాటించాలని పేర్కొన్నారు. అనంతరం నంద్యాల ఏడీఏ రాజశేఖర్ మాట్లాడుతూ నూతన వంగడాలతో అధిక దిగుబడి సాధించదచ్చునన్నారు. కార్యక్రమంలో నంద్యాల మండల ఉద్యాశాఖాధికారి శ్రీధర్, డిజిటల్ గ్రీన్‌సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

వీవోఏలపై రాజకీయ వేధింపులు ఆపాలి



ధర్నా చేస్తున్న నాయకులు

నంద్యాల (కల్చరల్), జూలై 16: వీవోఏలపై రాజకీయ వేధింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సోమన్న డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. వీవోఏలపై రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు,రాష్ట్ర కోశాధికారి తిరుపతయ్య, సీఐటీయూ నాయకులు బాలవెంకట్, లక్ష్మణ్, శంకరయ్య, పుల్లయ్య, అంజనేయులు, వెంవకటరమణ, జ్యోతి, సుబ్రహ్మణ్యం, సురేష్, నాగవర్ధన్, మధులు పాల్గొన్నారు.

పర్యాటకులు మెచ్చేలా అభివృద్ధి చేయండి

● ఒకే రోజు ప్రముఖ పుణ్యక్షేత్రాలు

సందర్శించేలా రూట్ మ్యాప్ సిద్ధం చేయండి: కలెక్టర్

నంద్యాల (కల్చరల్), జూలై 16: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను పర్యాటకులు మెచ్చేలా అభివృద్ధి చేయాలని టూరిజం అధికారులను కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పర్యాటక మండలి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. కమిటీ సభ్యులైన జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ మోహన్, టూరిజం అధికారి సత్యనారాయణ తదితరులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే శ్రావణ, కార్తీక మాసాలలో జిల్లాలోని పుణ్యక్షేత్రాలలో పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుందని, ఈ మేరకు జిల్లాలోని దేవాలయాల అన్నింటిని ఒక సర్క్యూట్ ప్యాకేజీగా తయారుచేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని జిల్లా టూరిజం అధికారిని ఆదేశించారు. శ్రీశైలం పుణ్యక్షేత్రం పాతాళ గంగలోని ప్రైవేట్ బోటు ప్రయాణానికి సంబంధించి పర్యాటక శాఖకు చెల్లించే రుసుమును 12 నుంచి 10 శాతానికి తగ్గించేందుకు కమిటీ సభ్యులతో కలెక్టర్ అంగీకరించారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

చంద్రబాబుపై నమ్మకంతో రాష్ట్రానికి పెట్టుబడులు

ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



ఎమ్మెల్యే కోట్లతో సమావేశమైన టీడీపీ, బీజేపీ నాయకులు

డోన్, జూలై 16: సీఎం చంద్రబాబుపై నమ్మకంతోనే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు విదేశీ సంస్థలు ముందుకు వస్తున్నాయని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని తన నివాసంలో ఎమ్మెల్యే కోట్లను బీజేపీ, టీడీపీ నాయకులు కలిసి పలు సమస్యలపై చర్చించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో గాడి తప్పిన పాలనను టీడీపీ కూటమి ప్రభుత్వం సమర్థవంతంగా సరి చేసిందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు నెరవేరుస్తూ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని అన్నారు. కూటమి నాయకుల సహకారంతో డోన్ నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు. నియోజకవర్గంలో రైతులకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కోట్ల వెల్లడించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, డోన్ అసెంబ్లీ కన్వీనర్ సంధు రమణ, బొగ్గరపు నటరాజ్, కిరణ్, రవి కుమార్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజోలి, తెలుగుగంగ అభివృద్ధికి ప్రతిపాదనలు ఇవ్వండి: ఎమ్మెల్యే



అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

ఆళ్లగడ్డ, జూలై 16: రాజోలి, తెలుగుగంగ అభివృద్ధికి ప్రతిపాదనలు ఇవ్వాలని ఎమ్మెల్యే అఖిలప్రియ సంబంధిత అధికారులను కోరారు. ఆళ్లగడ్డ పట్టణంలోని ఆమె స్వగృహంలో తెలుగుగంగ ఈఈ, డిఈ, ఏఈలతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రాజోలి రిజర్వాయరు కేసీ ఆయకట్టు రైతులకు ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతుందని, రిజర్వాయరు అభివృద్ధికి కావాల్సిన నిధులను సంబంధిత మంత్రితో మాట్లాడి నిధులు తెచ్చేందుకు కృషి చేస్తానన్నారు. కేసీ కాలువ రైతులకు వరమని, ఈ కాలువ అభివృద్ధిపై నిర్లక్ష్యం చేయరాదని, దీని అభివృద్ధికి ప్రతిపాదనలు ఇవ్వాలని కోరారు.

పుట్టా పెద్దమ్మకు పూజలు

బేతంచెర్ల, జూలై 16: బేతంచెర్ల-బనగానపల్లె రహదారిలోని గిన్నెమిల్లుకు సమీపంలో వెలసిన పుట్టా పెద్దమ్మకు మంగళవారం భక్తులు పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి కుంకుమార్చనలు, అభిషేకాది పూజలు నిర్వహించి మహా మంగళహారతులు ఇచ్చి నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకుడు రామకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

మొహర్రం పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

చాగలమర్రి, జూలై 16: గ్రామాల్లో మొహర్రం పండుగను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ రమణయ్య సూచించారు. బుధవారం చాగలమర్రి గ్రామంలో జరిగే మొహర్రం ఉత్సవాల్లో ఎలాంటి మారణాయుధాలు, కర్రలు పట్టుకోరాదన్నారు. లాల్‌స్వామి ఊరేగింపు సమయంలో ఎలాంటి ఘర్షణలకు పాల్పడరాదని, ఊరేగింపును విజయవంతం చేయాలని అన్నారు.

నేడు ఆలయ భూముల కౌలు వేలం

ఉయ్యాలవాడ, జూలై 16: మండలంలోని హరివరం గ్రామంలో వెలసిన వినాయక, జనార్దన, రామలింగేశ్వర స్వాము వారికి చెందిన 90 ఎకరాల భూమిని ఏడాది పాటు కౌలుకు ఇచ్చేందుకు బుధవారం ఉదయం 10 గంటలకు బహిరంగ కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో చంద్రుడు మంగళవారం తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ. 5 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. దేవాదాయశాఖ ఆదేశాల మేరకు షరతులు వర్తిస్తాయని ఆయన తెలిపారు.

ఎస్టీల ఆర్థికాభివృద్ధికి చేయూతనివ్వాలి

ప్యాపిలి, జూలై 16: ఎస్టీల ఆర్థికాభివృద్ధికి చేయూత నివ్వాలని రాష్ట్ర స్త్రీ, మహిళా, ఎస్టీ సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి వినతి పత్రం అందజేసినట్లు టీడీపీ రాష్ట్ర ఎస్టీ అధికార ప్రతినిధి మధుకుమార్ తెలిపారు. మంగళవారం అమరావతిలోని సచివాలయంలో నిర్వహించిన టీడీపీ రాష్ట్ర స్థాయి ఎస్టీ సదస్సుకు మధుకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సదస్సులో ఎస్టీలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు.

మైనార్టీ హక్కుల పరిరక్షణ కమిటీ ఎన్నిక

ప్యాపిలి, జూలై 16: మండల మైనార్టీ హక్కుల పరిరక్షణ కమిటీని మంగళవారం కర్నూలులో ఆ సంఘం రాష్ట్ర నాయకుడు మహమ్మద్ ఫారుక్ సుబ్లీ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సయ్యద్ అక్బర్ వలి, ఉపాధ్యక్షులుగా షేక్ ముస్తాఫా, మాలిక్ బాషా, కార్యదర్శులుగా సయ్యద్ బాషా, హుసేన్, హుసేన్‌పీరా, జాఫర్, సహాయ కార్యదర్శులుగా హనీఫ్, ఇర్ఫాన్‌లతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

పంపిణీకి సిద్ధంగా యూనిఫాం

కొలిమిగుండ్ల, జూలై 16: మండలంలోని వివిధ గ్రామాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సంబంధించి యునిఫాం మంజూరైనట్లు మండల విద్యాధికారి అబ్దుల్‌కలాం మంగళవారం వెల్లడించారు. మొత్తం 4,130 మంది విద్యార్థులకు యూనిఫాం ఎంఈవో కార్యాలయానికి చేరుకున్నాయని, రెండు రోజుల్లో ఆయా పాఠశాలలకు చేరవేసి విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు ఎంఈవో తెలిపారు.

పాతకక్షలతో వ్యక్తిపై రాళ్లతో దాడి

బేతంచెర్ల, జూలై 16: మండలంలోని నాగమల్లకుంట గ్రామానికి చెందిన దయ్యాల వెంకట కుమారుడు రామయ్యను అదే గ్రామానికి చెందిన గోపాల్, మరో ఇద్దరు పాత కక్షలు మనసులో పెట్టుకుని దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని హెడ్ కానిస్టేబుల్ షేక్షావలి మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన దయ్యాల రామయ్య గత నెల 4న తన పొలానికి వెళ్తుండగా.. గోపాల్, మరో ఇద్దరు రాళ్లతో దాడి చేసి గాయపరిచి, నిన్ను చంపుతామని బెదిరించారని తెలిపారన్నారు. గాయ పడిన రామయ్య కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ముగ్గురిపై ఫిర్యాదు చేశాడన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు గోపాల్, మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

పూజారి ఇంట్లో చోరీ

అవుకు, జూలై 16: అవుకు మండలం కునుకుంట్ల గ్రామానికి వెళ్లే రహదారిలో వెలసిన కనుమ పెద్దమ్మ పూజారి కాకర్ల బాలుడు ఇంట్లో మంగళవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. పెద్దమ్మ అమ్మవారికి భక్తులు సమర్పించిన 20 తులాల వెండి, 10 గ్రాములు బంగారం, రూ.లక్ష నగదు, ఆలయంలోని పెద్దమ్మ అమ్మవారికి కళ్లకు పెట్టిన రాగిరేకులు దొంగలు దోచుకెళ్లినట్లు తెలుస్తోంది. పూజారి పెద్దమ్మ ఆలయం సమీపంలోనే ఇంట్లో కుటుంబంతో కలసి నివసించే వారు. పెద్ద సరిగెత్తు కావడంతో సొంత గ్రామమైన కునుకుంట్లకు కుటుంబంతో కలసి వెళ్లాడు. ఇదే అదను గా భావించిన దొంగలు పూజారి ఇంటి తాళాలు పగుల గొట్టి చోరీ చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

భక్తి శ్రద్ధలతో పెద్ద సరిగెత్తు

డోన్(రూరల్), జూలై 16: పట్టణంలో మొహర్రం వేడుకల్లో భాగంగా పెద్ద సరిగెత్తు వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని కొండపేట, జెండాకట్ట వీధుల్లో ఉన్న ఇమామ్ కాశీం పీర్లచావిడిలో కొలువుదీరిన పీర్లను ప్రత్యేక పూజలు చేసి అనంతరం పీర్లను ఊరేగించారు. డిపో కాశీం వలి కుమారులు వక్ఫ్‌బోర్డు ముత్తావలి, మాలిక్‌బాషా ఆధ్వర్యంలో పెద్ద సరిగెత్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు.

కోవెలకుంట్ల: పట్టణంలోని చిన్నవరం సావిడి, పెద్దవరం పీర్ల సావిడిలతోపాటు పలు సావిడిలో పెద్దసరిగెత్తు రోజున పీర్లను అలంకరించి వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గడ్డం నాగేశ్వర్‌రెడ్డి, టీడీపీ యువ నాయకులు డాక్టర్ పేరా శ్రీధర్‌రెడ్డి, పెనుగొండ రాజశేఖర్, మురళి, కుళాయి పాల్గొన్నారు.

అవుకు: మండలంలోని ప్రజలు పెద్ద సరిగెత్తు వేడుకలను ఘనంగా మంగళవారం జరుపుకున్నారు. సాయంత్రం భక్తులు ఖాజాబందేనవాజ్, మౌలాలి, కప్పగుంతల పీర్ల చావిళ్ల వద్దకు అధిక సంఖ్యలో భక్తులు చేరుకొని పీర్లకు దట్టీలు, పూలమాలలు సమర్పించారు. అనంతరం పీర్లను చావిళ్లకు చేర్చారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలోని కొండమాయపల్లె, యల్లావత్తుల, చిన్నకంబలూరు, పెద్దకంబలూరు, రుద్రవరం, అప్పనపల్లె, చిత్రేణిపల్లె, మందలూరు, ఇంకా పలు గ్రామాల్లో పెద్దసరిగెత్తు వేడుకలు నిర్వహించారు. స్వాములకు పూలసేరాలు, దర్బిలు, వెండి గొడుగులు సమర్పించారు.

ప్యాపిలి: పట్టణంలో పెద్ద సరిగెత్తు వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పీర్ల స్వాములకు సదివింపులు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

శిరివెళ్ల: మొహర్రం వేడుకల్లో భాగంగా మండలంలోని యర్రగుంట్ల, వనికిందిన్నె తదితర గ్రామాల్లో మంగళవారం పెద్దసరిగెత్తు వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పీర్ల చావిడిల వద్దకు వెళ్లి ఫాతెహాలు చదివించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన అగ్ని గుండాల వద్ద పిల్లలు, పెద్దలు ఆనందోత్సాహాలతో గడిపారు.

కొలిమిగుండ్ల: మండలంలోని మీర్జాపురం గ్రామంలో మధ్య సరిగెత్తు వేడుకలు మంగళవారం ముగిశాయి. వేకువజామునే మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ బాదుల్లాస్వామి పీరును ఊరేగించారు. సాంప్రదాయ పద్ధతిలో ముజా వరి ప్రత్యేక ప్రార్థనల అనంతరం బాదుల్లాస్వామి పీరు వంద లాది మంది భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా గ్రామ టీడీపీ నాయకులు పోరెడ్డి చిన్నపురెడ్డి, పిక్కిలి శ్రీరాముడు, రంగస్వామి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారికి పూల దట్టీలు, కపడాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా తిమ్మనాయినిపేట, బందా ర్లపల్లె తదితర గ్రామాల్లో మధ్య సరిగెత్తు వేడుకలు నిర్వహించారు.

బేతంచెర్ల: మొహర్రం వేడుకల్లో భాగంగా మంగళవారం మండలంలోని సీతారామాపురం గ్రామంలో పీర్లకు భక్తులు ఫతేహాలు, జాతాలు నిర్వహించారు. కార్యక్రమంలో డోన్ న్యాయవాది భాస్కర్ రెడ్డి, డోన్ టీడీపీ ఇన్ చార్జి ఎరుకుల చెరువు శివ, టీడీపీ సీనియర్ నాయకులు పోలూరు రాఘవరావు, టీడీపీ మండల కన్వీనర్ ఎల్లనాగయ్య, సమన్వయ చైర్మన్ చంద్రశేఖర్, పట్టణ సమన్వయ చైర్మన్ సుధాకర్, షేక్షావలి చౌదరి, తిరుమలేష్ చౌదరి, గ్రామ నాయకులు వెంకట్రాముడు, పిల్లి అశ్వర్థ, ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడు మద్దయ్య, సుబ్బయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో మతసామరస్యానికి ప్రతీకగా హిందూ ముస్లింలు కలిసి జరుపుకునే పండుగ మొహర్రం. మంగళవారం మధ్యసరిగెత్తు సందర్భంగా భక్తులు పీర్ల చావిడిలకు వెళ్లి ప్రత్యేక ఫాతెహాలు చేశారు. మండలంలోని కొండాపురం, భాగ్యనగరం, రామచంద్రాపురం, దొర్నిపాడు, క్రిష్టిపాడు, గోవిందిన్నె, కొత్తపల్లె గ్రామాల్లో మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు.

బనగానపల్లె: బనగానపల్లె పట్టణంలో పెద్ద సరిగెత్తు వేడుకలు మంగళవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పట్టణంలోని భానుముక్కలలోని కొండపేటలో వెలసిన తల్లిపీర్ల చావిడి వద్ద, నాలుగు స్తంభాల గుడి వద్ద వెలసిన ఇమాంహుసన్ హుసేన్ పీర్లకు భక్తులు పీర్లకు మొక్కులు చెల్లించుకొని ఫతేహాలు సమర్పించారు. సీఐ గంటా సుబ్బారావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

పీర్లచావిళ్ల వద్ద బీసీ ఇందిరమ్మ పూజలు

బనగానపల్లె పట్టణంలోని కొండపేటలోని తల్లిపీర్ల చావిడి వద్ద రోడ్లు, భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి ఇందిరమ్మ మంగళవారం రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. పీర్ల చావిడి వద్ద పూలచద్దర్ సమర్పించి ఆమె మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తెలుగుపేటలో పీర్ల చావిడి వద్ద బీసీ ఇందిరమ్మ మొక్కులు చెల్లించుకున్నారు.

సంజామల: మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం పెద్ద సరిగెత్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. చావిడ్లను విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించి కొలువుదీరిన పీర్లకు అలంకరించారు. సంజామల పడమటి వీధిలో కొలువుదీరిన హసన్, హుసేన్ పీర్లకు నిర్వాహకులు వైభవంగా పెద్ద సరిగెత్తు వేడుకలు నిర్వహించారు. ఎస్.ఐ రమేష్ రెడ్డి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



ప్యాపిలి, అవుకులో పీర్లకు పూజలు చేస్తున్న భక్తులు



డోన్‌లో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు



పీర్ల చావిడి వద్ద పూజలు చేస్తున్న బీసీ ఇందిరమ్మ



కొలిమిగుండ్ల మండలం మీర్జాపురంలో ఊరేగిస్తున్న బాదుల్లాస్వామి పీరు, వేడుకల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు



కోవెలకుంట్లలో..



రుద్రవరం మండలం కొండమాయపల్లెలో..

ఘనంగా లాల్‌స్వామి ఊరేగింపు

చాగలమర్రి, జూలై 16: చాగలమర్రి గ్రామంలో మొహర్రం వేడుకల సందర్భంగా మంగళవారం రాత్రి ప్రధాన పీరు లాల్‌స్వామి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ధివిటీల మధ్య లాల్‌స్వామిని పురవీధుల గుండా ఊరేగింపు చేశారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు, మహిళలు తరలివచ్చి లాల్‌స్వామికి ప్రత్యేక ఫాతెహాలు చేశారు. చావిడి ముందు అగ్ని గుండం చుట్టూ లాల్‌స్వామిని తిప్పి ఊరేగింపు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా డీఎస్పీ పర్యవేక్షణలో సీఐలు, ఎస్ఐలు పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఫాతెహాలు చేసిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

చాగలమర్రి గ్రామంలో మొహర్రం పండుగ సందర్భంగా చిన్నమకానం వీధిలో కొలువుదీరిన ప్రధాన పీర్లకు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మంగళవారం రాత్రి ప్రత్యేక ఫాతెహాలు చేశారు. అఖిలప్రియ చాగలమర్రికి రాగానే టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. అనంతరం వీధుల గుండా లాల్‌స్వామి మకానం వద్దకు వెళ్లి లాల్‌స్వామికి ఫాతెహాలు చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కమిటీ సభ్యులు శాలువ, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, మండల కన్వీనర్ నరసింహారెడ్డి, బీసీ సెల్ నంద్యాల స్పోక్‌పర్సన్ సల్లానాగరాజు, టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు, కొలిమి ఉసేన్‌వలి, కొలిమి షరిఫ్, మౌలాలి, అనిఫ్, జెట్టి నాగరాజు, అబ్దుల్లా, గఫార్, శ్యాబుల్, అజిమ్, కరిముల్లా, నూర్‌బాష, ఖాజారసూల్, ఇర్షాద్, టైలర్ ఖాదర్, రమేష్, బీసీ సంఘం, దూదెకుల సంఘ నాయకులు పాల్గొన్నారు.

● చాగలమర్రి గ్రామంలోని చిన్నమకానం వీధిలో కొలువుదీరిన ప్రధాన పీరు లాల్‌స్వామికి ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి మంగళవారం సాయంత్రం ప్రత్యేక ఫాతెహాలు చేశారు. కమిటీ సభ్యులు శాలువ, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో మైనార్టీసెల్ కార్యదర్శి షేక్.బాబులాల్, మండల కన్వీనర్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

●చాగలమర్రి గ్రామంలోని చిన్నమకానం వీధిలో కొలువుదీరిన లాల్‌స్వామికి ఆళ్లగడ్డ జనసేన నాయకుడు ఇరిగెల సూర్యనారాయణరెడ్డి మంగళవారం రాత్రి ప్రత్యేక ఫాతెహాలు చేశారు. జనసేన నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. కమిటీ సభ్యులు సన్మానించారు. ఆయన వెంట జనసేన నాయకులు అబ్దుల్లా, సుబ్బయ్య, మాబాష, షబ్బీర్, శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.



లాల్‌స్వామికి ఫాతెహాలు చేస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

కుష్ఠు వ్యాధి కేసులను గుర్తించాలి: వైద్యాధికారి

బనగానపల్లె, జూలై 16: కుష్ఠు వ్యాధి కేసులను గుర్తించాలని టంగుటూరు వైద్యాధికారి డాక్టర్ శివశంకరుడు సిబ్బందిని కోరారు. మంగళవారం బనగానపల్లె మండలంలోని టంగుటూరు ఆరోగ్య కేంద్రంలో కుష్ఠువ్యాధిపై అవగాహన సదస్సును నిర్వహించారు. డాక్టర్ శివశంకరుడు మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఈనెల 18వ తేదీ నుంచి వచ్చే నెల ఆగస్టు 2వతేదీ వరకు కుష్ఠు వ్యాధిపై గ్రామ గ్రామాన సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఆశావర్కరు, ఏఎన్ఎంలు, మేల్ వలంటీర్లు సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సోహెల్‌బాబు, వైద్య సిబ్బంది వెంక టేశ్వర్లు, అయ్యమ్మ, సరసవతి, ఏఎన్ఎం లు, ఎంఎల్‌హెచ్‌పీలు, మేల్ వలంటీర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని ప్రభుత్వ వైద్యశాలలో మంగళవారం వైద్యులు ఇమ్రాన్ ఆధ్వర్యంలో కుష్ఠువ్యాధి సర్వేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈనెల 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు కుష్ఠువ్యాధిపైన ఆశా వర్కర్లు, మెయిల్ వలంటీర్లు ఒక టీమ్‌గా ఏర్పడి ఇంటింటి సర్వే చేస్తారని నోడల్ అధికారి రామలింగారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రమణమ్మ, హెచ్ఈ వెంకటమ్మ, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

అవుకు: కుష్ఠువ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారులు డాక్టర్ వినోద్ కుమార్, యమున, నవీన్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం అవుకు మండల పరిషత్ కార్యాలయంలో వైద్య సిబ్బందికి కుష్ఠువ్యాధి సర్వేపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 18వతేదీ నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు మండల వ్యాపంగా కుష్ఠువ్యాధి సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ మల్లేశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్లు వేణుగోపాల్‌రాజు, వరలక్ష్మి, దానమ్మ పాల్గొన్నారు.



టంగుటూరులో కుష్ఠువ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్

వేరుశనగ, కంది పంటల సందర్శన

డోన్(రూరల్), జూలై 16: డోన్ మండలం సీసంగుంతల, ఉంగరానిగుండ్ల, కొత్తపల్లి గ్రామ పరిసరాల్లో నంద్యాల జిల్లా ఏరువాకకు చెందిన ప్రధాన శాస్త్రవేత్తలు పంట పొలాలను సందర్శిం చారు. డోన్ మండలంలో ప్రధాన పంటలైన వేరు శనగ, కంది పంటలను ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్తలు రామకృష్ణారావు, బాలాజీనాయక్, డోన్ వ్యవసాయ ఏడీఏ అశోకవర్ధన్‌రెడ్డి, మండల వ్యవ సాయాధికారి అబ్దుల్ షఫీలతో కలిసి పొలాలను పరిశీలించారు. కంది వేరుశనగ పంటల్లో రసం పీల్చే పచ్చదోమ, తమర పురుగులు, పచ్చదోమ, పేనుబంక, శనగ పచ్చ పురుగు, వేరుకుళ్లు, ఆకు పచ్చ తెగుళ్ల వల్ల పంటలకు నష్టం కలుగుతోందని రైతులకు తెలిపారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు నష్టనివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు.

బ్యాడ్మింటన్ క్రీడపై శిక్షణ

ఆళ్లగడ్డ, జూలై 16: పట్టణంలోని విద్యార్థులకు బ్యాడ్మింటన్‌పై శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, ప్రముఖ వైద్యుడు రామ్‌గోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం వారు ఇండోర్ స్టేడియాన్ని పరిశీలించారు. ఈ నెల 21వ తేదీ నుంచి శిక్షణను సాయంత్రం 5.30 గంటల నుంచి 7గంటల వరకు ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు.

శాకంబరి అలంకారంలో పార్వతిదేవి

చాగలమర్రి, జూలై 16: చాగలమర్రి గ్రామంలోని పాత శివాలయంలో శాకంబరి అలంకారంలో మంగళవారం పార్వతిదేవి కొలువుదీరారు. ఆషాఢమాసం సందర్భంగా మహిళలు సామూహికంగా వడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. పండ్లు, కూరగాయలు, వివిధ రకాల ఆకులతో పార్వతిదేవిని అలంకరించారు.

కౌలు రైతులకు అవగాహన సదస్సు

శిరివెళ్ల, జూలై 16: మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో వ్యవసాయాధికారి సుధాకర్ కౌలు రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కౌలు రైతు గుర్తింపు కార్డు ప్రయోజనాలు, వాటిని తీసుకునేందుకు కావాల్సిన అర్హత పత్రాల గురించి వివరించారు. కౌలు రైతులు తమ ఆధార్‌తో పాటు భూ యజమాని పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు ప్రతులతో వీఆర్వోను సంప్రదిస్తే కౌలు గుర్తింపు కార్డులు మంజూరు చేస్తారని వివరించారు.

కొలిమిగుండ్ల: కౌలు కార్డులు తీసుకోవడం వల్ల రైతులకు అనేక రకాల ఉపయోగాలు ఉంటాయని తహసీల్దార్ సునీతాబాయి అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వానికి సంబంధించిన పలు పథకాలు వర్తించడంతోపాటు, పంట సాగుకు రుణాలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి కౌలు రైతు ఆయా గ్రామాలకు చెందిన వీఆర్వోలను సంప్రదించి కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చాగలమర్రి/సంజామల/రుద్రవరం: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలంటే కౌలు రైతులకు కౌలు కార్డు తప్పనిసరిగా ఉండాలని చాగలమర్రి తహసీల్దార్ రమణమ్మ, ఏవో రంగనేతాజీ పేర్కొన్నారు. మంగళవారం చాగలమర్రి, సంజామల, రుద్రవరం మండలాల్లో గ్రామసభలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో సంజామల మండల వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి, భూసాని చంద్రశేఖర్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, పెరుగు శ్రీనివాసులు, రామ్మో హన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, పసుపల మహమ్మద్, రుద్రవరం వీఆర్వోలు ఓబులేసు, మల్లేశప్ప, పుల్లయ్య పాల్గొన్నారు.



శిరివెళ్లలో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి సుధాకర్

చాగలమర్రిలో కొండచిలువ హల్‌చల్



చాగలమర్రి, జూలై 16: చాగలమర్రి గ్రామంలోని అడ్డవాగు సమీపంలో మంగళవారం కొండ చిలువ హల్‌చల్ చేసింది. ముళ్ల పొదల నుంచి రోడ్డుపైకి వస్తున్న కొండ చిలువను చూసి కొందరు భయభ్రాంతులకు గురయ్యారు. 8 అడుగుల పొడవు, 50 కేజీల బరువుగల కొండ చిలువను స్థానికులు కర్రలతో హతమార్చారు. పారిశుధ్య సిబ్బంది చనిపోయిన కొండ చిలువను గ్రామానికి దూరంగా పడవేశారు.

ఏఎన్ఎం, సీహెచ్‌వోల రికార్డులు తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న ఆరోగ్యశాఖ డీపీవో నాజ్‌నీమ్

ఉయ్యాలవాడ, జూలై 16: మండలంలోని మాయలూరు గ్రామం పీహెచ్‌సీల పరిధిలోని సబ్‌సెంటర్ల రికార్డులను తనిఖీ చేశారు. మంగళవారం పీహెచ్‌సీలో కోవెలకుంట్ల, మాయలూరు సబ్‌సెంటర్ల రికార్డులను ఆరోగ్యశాఖ డీపీవో నాజ్‌నీమ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెల జిల్లాలోని 10 సబ్‌సెంటర్ల రికార్డులను తనిఖీ చేస్తామన్నారు. డీడీఎం శివకుమార్, వైద్యాధికారి రాబర్ట్ కెనెడీ, సీహెచ్‌వో సుజాత, పీహెచ్ఎస్ మునిస్వామి, మహిళా పీహెచ్ఎస్ పద్మావతమ్మ, హెల్త్‌అసిస్టెంట్ క్రిష్ణ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పశువుల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



గర్భకోశ వ్యాధుల నివారణ మందు ప్యాకెట్‌లను అందజేస్తున్న డీడీ, ఏడీ

చాగలమర్రి, జూలై 16: గ్రామాల్లో రైతులు పశువుల వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆళ్లగడ్డ డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య అన్నారు. మంగళవారం మండలంలోని నగల్లపాడు గ్రామంలో రాష్ట్రీయ గోకుల మిషన్ ద్వార ఉచిత పశుగర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఏడీ వరప్రసాదుతో కలిసి ఆయన ప్రారంభించారు. గొడ్డుమోతు పశువులు, ఎదకు రాని పశువులకు, గర్భకోశ వ్యాధుల చికిత్సలు చేశారు. 45 పశువులు, 90 దూడలకు వైద్య చికిత్సలు చేసి డివార్మింగ్ మందు తాపించారు. పశువైద్యాధికారులు సాయిబాబా, దీపకుమారి, రవీంద్రారెడ్డి, బీఎల్‌వోలు మురళీకృష్ణ, జమాల్ వలి, పశువైద్య సిబ్బంది, సాజీసాహేబ్, ఏహెచ్‌ఏలు పాల్గొన్నారు.